అసహనంగా వాచీ చూశాడు సత్యమూర్తి. పన్నెండు గంటలైంది. పోస్టాఫీస్‌లో హడావిడిగా పనులు జరుగుతున్నాయి. సత్యమూర్తి కడుపు మండుతోంది.

కారణం! మనియార్డర్ చేయాలని 'క్యూ'లో నిల్చుని గంటసేపైనా 'క్యూ' పెరిగిందేగానీ కౌంటర్ క్లర్క్ రాలేదు.

'క్యూ'లో జనమంతా ముచ్చట్లలో పడ్డారు. పక్క కౌంటర్లో క్లర్క్‌ను అడిగాడు సత్యమూర్తి ఎం.ఒ. క్లర్క్ ఏమయ్యాడని.

"వస్తాడు! వెయిట్ చెయ్యండి!" అని.

ఒకటి... రెండు... పది... పధ్నాలుగు - ఎన్నిసార్లడిగినా సమాధానం ఒకటే, "బయటి కెళ్లాడు! వస్తాడు కూర్చోండి" అని. సత్యమూర్తి అసహనం తారాస్థాయినందుకుంది.

"ఆ కంప్లయింట్ బుక్ ఇలా ఇవ్వండి!" అన్నాడు ఆఫీసు సూపరింటెండెంట్ దగ్గర కెళ్ళి.

ఆఫీసు సూపరింటెండెంట్ ఒక్కసారి సత్యమూర్తి వైపు ఎగాదిగా చూశాడు. "కంప్లయింట్ బుక్ ఎందుకు? అసలు ఏమైంది?"

"ఏమైందా! గంట సేపయింది క్యూలో తగలడి - ఆ కౌంటర్ క్లర్క్ అసలు వున్నాడా లేడా?" గంభీరంగా అన్నాడు సత్యమూర్తి.

"చూడండీ! ఏదో పని మీద బయటి కెళ్ళుంటాడు. కొంచెం ఓపిగ్గా వెయిట్ చేస్తే సరిపోతుంది! అంతేకానీ ఇలా అడ్డమైన వాటన్నిటికీ కంప్లయింట్ లివ్వడానికి ఇది ఏమన్నా మునిసిపాలిటీ అనుకున్నారా!?" లెక్క లేనట్లు ఫైల్లోకి చూస్తూ అన్నాడు సూపరింటెండెంట్.




సత్యమూర్తికి చెళ్ళున చరిచినట్టయింది. కోపం తారాస్థాయి నందుకుంది.

"ఏమిటయ్యా! వెధవ సమర్థింపు. మనియార్డర్ కౌంటర్‌లో గంట సేపట్నించి క్లర్క్ లేకపోతే మీ కళ్ళు కనిపించడం లేదా! పైగా కంప్లయింట్ బుక్ ఇవ్వమంటే అడ్డమైన పనులని మళ్ళీ మాట్లాడడానికి... వుండాలి"

"ఏమిటయ్యా నువ్వనేది! కంప్లయింట్ ఇచ్చి ఏం చేస్తావ్?" ధీమాగా అన్నాడు సూపరింటెండెంట్.

"ఇలా అడ్డమైనవాళ్ళందరూ కౌంటర్లలో వుంటే పబ్లిక్ సఫర్ అవుతారని బల్లగుద్ది చెబుతాను..." జంకు లేకుండా అనేశాడు సత్యమూర్తి.

"షటప్!. మర్యాదగా మాట్లాడు! ఇది ఆఫీసు"

"ఏంటయ్యా! ఇది ఆఫీసా! సంతకంటె ఘోరంగా లేదూ..." సత్యమూర్తి వ్యంగ్యం.

"యూ ఫూల్..." సూపరింటెండెంట్ ఆవేశం. కంప్లయింట్ బుక్ ఇవ్వనేలేదు. సత్యమూర్తి సూపరింటెండెంట్ చొక్కా పట్టుకుని అన్నాడు - "డర్టీఫెలో ఈ దేశం ఇందుకే ఇలా తయారైంది!" అని. అంతే!

ప్యూన్ వచ్చి సత్యమూర్తిని విడదీసి పక్కకు తోసు కెళ్ళాడు. ఆఫీసు స్టాఫంతా సినిమా చూసినట్టు చూస్తున్నారు.

మనియార్డర్ కౌంటర్లోకి క్లర్క్ వచ్చాడు. క్యూలో జనం సత్యమూర్తికి సత్తాను రాలేదు. ఇదేమిటని క్లర్క్‌ను ప్రశ్నించలేదు. ఈ దేశం ఇంతే అన్నట్టుగా పని జరిగిపోతోంది.

- శ్రీరామదాసు అమరనాథ్

అతడు... ఎన్నో మెట్లెక్కుతున్నాడు. దిగుతున్నాడు. నో వేకెన్సీ బోర్డు లతడికి స్వాగతం చెబుతున్నాయి. "అబ్బా... ఖాళీ లేదు పోవయ్యా" అనే కసరింపు లెదురవుతున్నాయి. ఆకలికీ, శ్రమకూ ఓర్చుకోలేక పోతున్న అతని తల అవమానభారంతో వంగిపోతోంది. యూనివర్సిటీ ఇచ్చిన గోల్డ్ మెడల్ మోయలేనంత బరువుగా అనిపించింది. దాన్ని చేతిలోకి తీసుకుని ఒక్క

## నో వేకెన్సీ...

క్షణం ఆర్ద్రంగా చూశాడతడు. తరువాత బలం కొద్దీ విసిరేశాడు. పారలేక పారుతున్న మురుగ్గుంటకు ఆనకట్ట వేసింది మెడల్.

అతని ముఖంలో ఆవేశం ప్రజ్వరిల్లింది.

వేరుగా ఒక ఆఫీసులోకి నడిచాడు. అక్కడ ఉద్యోగం కోసం ఒక అభ్యర్థి అధికారికి లంచం ఇస్తున్నాడు.

అతడు ఆ అభ్యర్థిని వేగంగా పక్కకు తోసి, అధికారిని చితక బాదాడు.

"రికమండేషనూ, లంచాలకూ లొంగిపోయి ప్రతిభను అణగద్రొక్కే ఈ దేశం నా కక్కరలేదు. సమర్థతకు పట్టంకట్టే, నిజాయితీకి అధికారం ఇచ్చే నా దేశాన్ని నేను తయారుచేస్తాను!" అతడు ఆవేశంగా పిడికిలి బిగిస్తూ అన్నాడు.

మరో నలుగురు యువకులు చేతులు జత కలిపి అతని అండగా నిలిచారు.

"కట్! ఒ.కే.!" తృప్తిగా అన్నాడు దర్శకుడు రామనాథం.

** ** **

'విప్లవ ధ్వని' షూటింగ్ పూర్తయింది. దేశంలోని అరాచకత్వాన్ని, ప్రభుత్వం అసమర్థతను ఏకి పారేసే పేట్టుగా నిర్మించారని ఆ చిత్రం విడుదల కోసం ఎంతో మంది ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

చిత్ర నిర్మాతకు మాత్రం ఆందోళన పెరుగుతోంది. లక్షలు వెచ్చించి నిర్మించిన చిత్రం విడుదలకు నోచుకోకుండా పోయి తలకు మించి అప్పుల్ని మిగులుస్తుందేమోనని భయపడసాగాడు. దానికి కారణం సెన్సార్ వారు సర్టిఫికెట్ ఇవ్వడానికి నిరాకరించడమే. ప్రభుత్వాన్ని అవమానించే చిత్రానికి సర్టిఫికెట్ ఇవ్వమంటూ భీష్మించుకూర్చున్నారు.

రామనాథానికి ఈ పరిస్థితి సంకటప్రాయంగా వుంది. ఎన్నో క్లిష్ట సమస్యల్ని సినిమాలలో నయితే పరిష్కరించేడు గాని, జీవితంలో ఎదుర్కోలేదెప్పుడూ.

ఎవరో వచ్చి నిర్మాత చెవిలో ఏదో చెప్పారు. నిర్మాత ముఖంలోకి కళాకాంతులు ప్రవేశించాయి.

రామనాథంతో కలసి ఆ వ్యక్తి వెంట వెళ్ళాడు. ఎవరినో కలిశారు. ఎవరెవరినో బతిమాలారు. డబ్బు సంచులు చేతులు మారాయి. 'విప్లవ ధ్వని'కి సెన్సార్ అనుమతి లభించింది.

ఆ చిత్రం విడుదలయిన రోజున నటీనటులకు, సాంకేతిక వర్గానికి ఘనంగా విందు ఏర్పాటు చేశాడు నిర్మాత. అందరూ ఆ ఉత్సవంలో సంతోషంగా పాలు పంచుకున్నారు.

కానీ, లంచమిచ్చి లంచానికి వ్యతిరేకంగా చిత్రం తీసావే అంటూ మనసు చేస్తున్న గోలకు "కట్... ఓ.కే.!" అని చెప్పలేకపోయాడు దర్శకుడు రామనాథం. లంచానికి 'నో వేకెన్సీ' అనడం తప్పు కదా!

- ఎస్. సుజాత

ఈ బహుమతి పొందిన రచనలలో మీకు నచ్చిన కాలమ్ దాటని కథ వివరాలు దిగువ ఇచ్చిన కూపన్‌లో నింపి, పోస్ట్ కార్డుపై అంటించి మా కార్యాలయానికి పంపండి.

- ఎడిటర్

ఈ సంచికలో నాకు నచ్చిన కథ: ______________________

రచయిత/ రచయిత్రి: ______________________

పేజీ నంబరు: ______________________